క్లుప్తంగా

నేడు వాసవీమాత విగ్రహ ప్రతిష్ఠ

తిరువూరు: స్థానిక మండలాఫీసు రోడ్డులో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని వంశపారం పర్య ధర్మకర్త దారా శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కన్యకా పరమేశ్వరి హోమం, 9.59 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలను వేదపండితులు నిర్వహిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో అన్నదానం జరుగుతుందన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



గానుగపాడు(తిరువూరు): గానుగపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు ప్రవాసాంధ్రుడు కె. సుధాకర్ సహకారంతో జెడ్పీ హైస్కూల్ ఆంగ్లోపాధ్యాయుడు ఎం. రాంప్రదీప్ శుక్రవారం కంప్యూటర్‌ను వితరణగా ఇచ్చారు. గతంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సైన్స్ పుస్తకాలు, బీరువా, కంప్యూటర్, ప్రింటర్, లౌడ్ స్పీకర్, మైక్రోస్కోప్‌లను దాతల సహకారంతోపాటు తన సొంత నిధులతో కలిపి రాంప్రదీప్ అందజేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వి. సాయిరాం కోరారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, సుదర్శన్, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని ప్రసన్న పాల్గొన్నారు.

11న పోస్ట్ బేసిక్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం

తిరువూరు: స్థానిక పాత తిరువూరు శివారు పీటీ కొత్తూరులోని పోస్ట్ బేసిక్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల 11న జరుగుతుందని ఆహ్వాన కమిటీ తెలిపింది. ఈ పాఠశాలలో చదివిన అన్ని బ్యాచ్‌ల పదో తరగతి పూర్వ విద్యార్థులు సమావేశానికి హాజరు కావాలని, పాఠశాల ఆవరణలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. వివరాలకు సెల్: 8500541387, 9885211283 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మాన్యా నాయక్‌కు నివాళి

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ మామయ్య, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, బాణావత్ బాలాజీ తండ్రి బాణావత్ మాన్యా నాయక్ (75) వయోభారంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ బొంతా సాంబశివరావు, కొండపల్లి పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, మండల అధ్యక్షుడు రెంటపల్లి నాగరాజు, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జి.రాణి, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు కోలకాని శ్రీనివాసరావు, ఐటీ వింగ్ అధ్యక్షుడు సందిపాము రాజేష్, గరికపాటి రాంబాబు తదితరులు మాన్యా నాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

5న ఆలయాల భూముల కౌలు వేలం

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల ఆలయాల భూములకు కౌలు నిమిత్తం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 5న టెండర్, బహిరంగ వేలం జరుగుతుందని మండల ఆలయాల కార్యనిర్వాహణాధికారి అనూరాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాములూరు కోటేశ్వరస్వామి ఆలయం భూములు 15.11ఎకరాలు, కాచవరం శ్రీరామ లింగేశ్వరస్వామి ఆలయం భూములు 21.74 ఎకరాలు, చిలుకూరు మల్లేశ్వరస్వామి ఆలయం భూములు 16.78 ఎకరాలకు వేలం జరుగుతుందన్నారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా ధరావతు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు సెల్: 90141 22629 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మైలవరం: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి స్వామివారి తిరు కల్యాణోత్సవాలు జరుగుతాయని దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, పాలక మండలి చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 11, 12 తేదీలలో కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వివరించారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ముసునూరు ఎంపీడీఓ రిలీవ్

ముసునూరు: ఇప్పటి వరకు ముసునూరు ఎంపీడీఓగా పనిచేసిన జి.రాణికి పదోన్నతి లభించింది. ఆమె నరసాపురం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి(డీఎల్‌డీఓ)గా నియమితులు కావడంతో శుక్రవారం సాయంత్రం రిలీవై నరసాపురంలో రిపోర్టు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఏఓ ఛాయాకుమారి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆమెను ఘనంగా సన్మానించారు. ప్రస్తుత ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ ముసునూరు ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు.

మూగజీవాలకు ప్రాణ సంకటం

- 90 శాతం చెరువుల్లో అడుగంటిన నీరు
- మట్టి కోసం చెరువుల్లో నీటిని బయటకు పంపుతున్న అక్రమార్కులు
- మూగజీవాలకు తాగేందుకు చుక్క నీరు లేక విలవిల
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- సాగర్ జలాల కోసం ప్రయత్నించని ప్రజా ప్రతినిధులు



ఆత్కూరు కురిటి చెరువులో తాగేందుకు నీరులేక వెళ్లిపోతున్న జీవాలు

జి.కొండూరు: ఎండ తీవ్రత పెరగడంతో చెరువుల్లో నీరు అడుగంటుతోంది. చెరువు మట్టిని తరలించి సొమ్ము చేసుకునేందుకు మట్టి మాఫియా సిద్ధమవుతోంది. తవ్వకాల సౌలభ్యం కోసం చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా బయటకు వదిలేస్తున్నారు. నియోజకవర్గంలో నీరు అడుగంటి 90 శాతం చెరువులు వెలవెలబోతున్నాయి. మట్టి తవ్వకాల కోసం ఎదురుచూస్తున్న అధికార పార్టీ పెద్దలు సాగర్ జలాల కోసం ప్రయత్నాలు కూడా చేయడం లేదు. వెరసి నియోజకవర్గంలో మూగజీవాలకు తాగేందుకు చెరువుల్లో చుక్కనీరు లేక అల్లాడిపోతుంటే మరో వైపు భూగర్భ జలాలు సైతం క్రమేపీ తగ్గిపోతున్నాయి.

మట్టి కోసం బరి తెగిస్తున్నారు

మైలవరం నియోజకవర్గంలో ఇటుక బట్టీలు అధికంగా ఉండడంతో మట్టి కొరత ఏర్పడి గతంలో డంపు చేసి ఉన్న మట్టిని ఇప్పటివరకు తరలించారు. డంపులలో మట్టి కూడా అయిపోవడంతో ఇక చెరువుల్లో మట్టి తరలింపునకు సిద్ధమవుతున్నారు. రియల్ వెంచర్లు సైతం విస్తరిస్తుండడంతో మెరకలు, రహదారుల నిర్మాణం కోసం మట్టికి డిమాండ్ పెరిగింది. దీనితో అక్కడక్కడా చెరువుల్లో మట్టి తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న కొద్దిపాటి నీటిని కూడా బయటకు పంపుతున్నారు. సాగర్ జలాలు తీసుకొచ్చి చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు మూగజీవాలకు తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని ప్రజాప్రతినిధులకు తెలిసినప్పటికీ, సాగర్ జలాలు తీసుకొస్తే మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందని భావించి ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేయడంలేదు.

మైలవరం నియోజకవర్గంలో చెరువులు, వ్యవసాయ విస్తీర్ణం, పశు సంపద వివరాలు

చెరువులు	144
వ్యవసాయ విస్తీర్ణం	41,200 హెక్టార్లు
పశువులు	78,886
జీవాలు	86,466

ఏటా ఇటుక బట్టీలకు తరలిస్తున్న మట్టి
25 లక్షల మెట్రిక్ టన్నులు

నీరు వృధాగా పోయిన ఘటనలు కొన్ని..

- మార్చి 1న వెల్లటూరు బంధుచెరువులో చేపలు పట్టడంతో పాటు చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా బయటకు పంపారు. ఇదే గ్రామంలో ఉన్న పడమర చెరువుకు ఇటీవల వచ్చిన వరదలకు పడిన గండ్లతో చెరువులో నీరంతా వృధాగా పోయింది. ఈ గ్రామంలో ఉన్న రెండు చెరువుల్లో నీరు లేకపోవడంతో గ్రామంలో పశువులు, మూగజీవాలకు తాగేందుకు నీరులేకుండా పోయింది.
- మార్చి నెల 12న ఆత్కూరు కురిటి చెరువులో చేపలు పట్టేందుకు ఉన్న కొద్దిపాటి నీటిని కూడా బయటకు వదిలేశారు. దీనితో పాటు ఈ గ్రామంలో ఉన్న కోమటి చెరువు, ఊర చెరువు, సావరాల చెరువులలో కూడా నీరు లేకపోవడంతో చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. ఈ గ్రామంలో మూగజీవాలు తాగునీరు లేక అల్లాడిపోతున్నాయి.
- ఈ నెల 1వ తేదీన మైలవరం మండల పరిధి చిలుకూరివారిగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ చెరువులో ఉన్న నీటిని మట్టి తవ్వకాల కోసం అక్రమార్కులు తూములు లేపి బయటకు విడుదల చేశారు. సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు రైతులతో కలిసి తూములు దింపారు. అప్పటికే నీరంతా వృధాగా పోయింది.

సాగర్ జలాలతో చెరువులు నింపాలి



మైలవరం నియోజకవర్గంలో చెరువులన్నీ వెలవెలబోతున్నాయి. వర్షాలు పడడం ఆలస్యమైతే భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో నీటి కొరత ఏర్పడుతుంది. పొలాల్లో మేతకు వెళ్లిన మూగజీవాలకు తాగేందుకు చుక్క నీరు లేదు. మట్టి తవ్వకాల కోసం చెరువులు నింపకపోవడం దుర్మార్గం. ప్రజా ప్రతినిధులు స్పందించి సాగర్ జలాలను తీసుకొచ్చి చెరువులు నింపాలి.

– చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు, కవులూరు



నీరులేక ఎండిపోయిన కోడూరు ఎర్ర చెరువు

వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుల నియామకం

జి.కొండూరు: మండల పరిధిలోని ఆత్కూరు, మునగపాడు గ్రామాలకు వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుల నియామకం గురువారం రాత్రి జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ ఆదేశాలతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో ఆత్కూరు గ్రామ అధ్యక్షుడిగా గంగుల తిరుపతిరావు, మునగపాడు గ్రామ అధ్యక్షుడిగా మండల శేషయ్యలను పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



తిరువూరు: గంపలగూడెం మండలం ఊటుకూరులోని కోదండ రామాలయం 12వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మూలవిరాట్‌లను నూతన వస్త్రాలు, వెండి ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు. భక్తులు ఆలయం చుట్టూ ద్వాదశ ప్రదక్షిణల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పద్మనాభుని సర్వేశ్వర రావు, సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఐ



మాట్లాడుతున్న చలసాని వెంకట రామారావు

నూజివీడు: ఓ సీడ్స్ కంపెనీ వారి హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాల వలన నష్టపోయిన కౌలు రైతులకు వెంటనే ఆ కంపెనీ వారు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని అమర్ భవనంలో నూజివీడు మండలం బోర్వంచకు చెందిన కౌలు రైతులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ కంపెనీ హైబ్రిడ్ మొక్కజొన్న విత్తనాలతో బోర్వంచ గ్రామంలో 27 మంది కౌలు రైతులు 68 ఎకరాలు సాగు చేశారన్నారు. వీరికి సగటున ఎకరాకు టన్నున్నర మాత్రమే దిగుబడి వచ్చి తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. కంపెనీ వారు ఎకరానికి 4 నుంచి 5 టన్నుల దిగుబడి వస్తుందని ఆశ చూపి కౌలు రైతులతో పంట వేయించారని, దిగుబడి తక్కువ రావడంతో రైతులు నష్ట పరిహారం అడిగితే ముఖం చాటేస్తున్నారన్నారు. రైతులకు పండిన దిగుబడికి ఇంత వరకు కంపెనీ డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారానికి ఈ నెల 5న సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బాధిత రైతులతో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహ, మడుపల్లి నాగేంద్రరావు, బొప్పూడి రాంబాబు, బాధిత రైతులు పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊట డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న పోలీసులు

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మంకొల్లు గ్రామంలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. గ్రామానికి చెందిన డి.భాస్కరావుపై కేసు నమోదు చేశామని చెప్పారు.

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడు ఎస్ఆర్ఐ ఇంజినీర్ కళాశాలలో ఐసీఆర్ఏఐసీ 21టీ–25 అంతర్జాతీయ సదస్సును ఘనంగా ప్రారంభించారు. సదస్సులో 122 కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులు విద్య, పరిశోధన బంధాలను పెంపొందింపజేస్తాయని చెప్పారు. పరిశోధనలో కొత్త ఆవిష్కరణతో పాటు వాటి ప్రయోజనాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ నాగ సాంబశివరావు, అధ్యాపకురాలు సునీత, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్ల పనులు ప్రారంభం

గండేపల్లి(కంచికచర్ల): మండలంలోని గండేపల్లి పంచాయతీ పరిధిలో మూడు బోర్ల ఏర్పాటు పనులను సర్పంచి బొక్కా రవికుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచి రవికుమార్ మాట్లాడుతూ ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మండల పరిషత్ నిధులు రూ.1,50 లక్షలు మంజూరు చేశారన్నారు. పంచాయతీ పరిధిలోని పేరకలపాడు రోడ్డులోని ఎస్సీకాలనీ, బొడ్డురాయి సెంటర్, బీసీ కాలనీలో ఈ బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై కార్మికులకు అవగాహన అవసరం

15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ

నూజివీడు: కార్మికులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ అన్నారు. కార్మిక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా కోర్టు భవనాల ఆవరణలోని బార్ అసోసియేషన్ హాల్‌లో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హమాలీ కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కార్మికులు హక్కులతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బ్యాడ్జీని కలిగి ఉండాలని, కార్మిక శాఖాధికారి కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకుని ఉంటే ప్రభుత్వాలు అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తిస్తాయని చెప్పారు. అసంఘటిత రంగంలోని కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని, ఈ–శ్రమ్ కార్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నెం రమేష్, సెక్రటరీ హరిబాబు, సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘కిశోరి వికాసం’పై బాలికలకు అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

నూజివీడు: కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహణ ద్వారా బాలికలకు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, చట్టాలు తదితర అంశాలపై అవగాహన పెంపొందిస్తున్నామని నూజివీడు ఇన్‌చార్జి సీడీపీఓ కె.ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని కుమ్మరిపేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో సీడీపీఓ ముఖ్య అతిథిగా పాల్గొని కిశోర బాలికలకు పలు సూచనలు చేశారు. విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, జీవనోపాధి అవకాశాలు, బాల్య వివాహాల నిర్మూలన, రుతు పరిశుభ్రత, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై బాలికలు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే టోల్‌ఫ్రీ నంబరు 1098కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

యంత్రాలతో సేద్యపు నీటి కుంటల తవ్వకం

పక్కదారి పడుతున్న ఉపాధి పథకం



జేసీబీతో తవ్విన సేద్యపు నీటి కుంట

నూజివీడు: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలతో తవ్వించాల్సిన ఫాం పాండ్స్(సేద్యపు కుంట)లను నూజివీడు మండలం కొత్త రావిచర్లలో ఉపాధి సిబ్బంది దగ్గరుండి జేసీబీతో తవ్విస్తున్నారు. గ్రామంలో జేసీబీతో 6 సేద్యపు నీటి కుంటలను తవ్వించడం గ్రామంలో తీవ్ర చర్చనీయాంశమైంది. ఇలా చేయడం వలన ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది.

కూలీలతో తవ్వించాల్సి ఉండగా..

రైతులు తమ పొలాల్లో సేద్యపు నీటి కుంటలను తవ్వించుకునేందుకు వీలుగా ఉపాధి హామీ పథకంలో నిధులు కేటాయించారు. దీంతో సేద్యపు నీటి కుంటలను తవ్వించుకోవాలనుకున్న వారు తమ వివరాలను ఉపాధి హామీ కార్యాలయంలో నమోదు చేసుకుని సిబ్బంది చెప్పిన కొలతల ప్రకారం కూలీలతో తవ్వించాలి. 10 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో తవ్విన సేద్యపు నీటి కుంటకు రూ.70 వేల వరకు ఉపాధి హామీ పథకం నుంచి చెల్లిస్తారు. దీనికి గాను సేద్యపు నీటికుంట తవ్వడానికి వచ్చిన కూలీలకు మస్తర్లు వేయాల్సి ఉంటుంది.

మస్తర్లు వేసే ప్రయత్నాలు..

కూలీలతో నీటికుంటల తవ్వకం పనులు చేయించకుండా జేసీబీతో చేయించి, కొంత మంది కూలీలతో ముందుగానే ఒప్పందం చేసుకొని మస్తర్లు వేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా నీటి కుంటలను యంత్రాలతో తవ్వినా పట్టించుకోకుండా ఉండేందుకు ఆఫీసుకు మామూళ్లు కూడా ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిసింది. ఇలా అక్రమ మార్గంలో సేద్యపు నీటి కుంటలు తవ్వి ప్రభుత్వ సొమ్మును స్వాహా చేయడానికి చూస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

బిల్లులు ఇవ్వం

ఈ వ్యవహారం మా దృష్టికి కూడా వచ్చింది. యంత్రాలతో తవ్విన సేద్యపు నీటి కుంటలకు రూపాయి కూడా చెల్లించం. అక్కడి మా సిబ్బందిని అడిగితే రైతులే తవ్వుకున్నారని చెబుతున్నారు. మండలంలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటాం.

–శ్యామ్, ఉపాధి హామీ పథకం ఏపీఓ, నూజివీడు

అందని వైద్యం.. రోగులకు ఆర్థిక భారం

పేదోడి వైద్యంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు తీసుకుంటున్న రోగులు (ఫైల్)

చాట్రాయి: ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్నామంటూ ప్రగల్భాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వ మాటలకు పొంతన లేకుండా పోతోంది. పేదోడికి వచ్చిన పెద్ద రోగానికి సరైన వైద్యం పల్లెల్లో అందడం లేదు. దీంతో శారీరకంగా, ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు. ఇంటి వద్దకే వైద్యం ప్రస్తుతం సర్వేలకే పరిమితమైంది. ఎంఎల్‌పీహెచ్‌సీలు సమ్మె బాట పట్టడంతో సర్వే మూలన పడింది. దీంతో పేదోడి రోగానికి తక్షణ వైద్యం అందని పరిస్థితి ఉందని ప్రజలు అంటున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు కార్పొరేట్ వైద్యం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో సర్వే చేసి ప్రాథమిక దశలో వ్యాధులను గుర్తించారు. గుర్తించిన వ్యాధులకు జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాల్లో ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించారు. దీని ద్వారా దీర్ఘకాలిక రోగాలకు, ప్రమాదకరమైన రోగాలకు చికిత్స అందించేవారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–1, ఫేజ్–2లో సుమారు 18 వేల మందికి ఈ శిబిరాల్లో ప్రత్యేక వైద్యులు ఎండీ, జనరల్, ఆర్థోపెడిక్, చిన్న పిల్లల వైద్యం, చర్మ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు నాణ్యమైన వైద్యంతో పాటు చెడిపోయిన ప్యాంక్రియాస్ గ్రంధి లాంటి రోగాలకు వైద్యం అందించారు. ప్యాంక్రియాస్ గ్రంధి చికిత్సకు నెలకు రూ.9 వేల నుంచి రూ.10 వేలు ఖర్చు అవుతుంది. ఈ వ్యాధి పేదోడికి భారంగా మారేది. అప్పట్లో పీహెచ్‌సీల్లో అందుబాటులో లేని మందులను ఆన్‌లైన్ ద్వారా రోగి ఇంటి వద్దకు అందించే వారు.

ఉచితంగా మందులు సరఫరా చేయాలి



నాకు ప్యాంక్రియాస్ గ్రంధి చెడిపోయింది. వ్యాధి చికిత్సకు నెలకు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు అవుతోంది. గత ప్రభుత్వంలో జగనన్న సురక్షలో ఉచితంగా పీహెచ్‌సీ ద్వారా అందించారు. ఇలాంటి వ్యాధులు కలిగిన వారు ఇంకా ఎంతోమంది ఉన్నారు. వీరికి ఉచితంగా ప్రభుత్వం మందులు సరఫరా చేయాలి. లేదా రూ.10 వేలు పెన్షన్ అందించాలి.

–కొమ్ము ఆనందం, చిన్నంపేట, చాట్రాయి మండలం

రాష్ట్రాన్ని మరోసారి మోసం చేయొద్దు



ప్రధాని మోదీకి సీపీఎం రాసిన బహిరంగ లేఖను ప్రదర్శిస్తున్న సత్యబాబు

వించిపేట(విజయవాడపశ్చిమ):రాజధాని నిర్మాణానికి రెండోసారి శంకుస్థాపన కార్యక్రమాలకు విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గత పది నెలలుగా ఆంధ్ర రాష్ట్రానికి చేసిన మోసాన్ని మరోసారి పునరావృతం చేయకుండా ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం విడుదల చేసిన బహిరంగ లేఖను పార్టీ నాయకులతో కలిసి సత్యబాబు 50వ డివిజన్ గొల్లపాలెంగట్టు రోడ్డులో ప్రదర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సీపీఎం ప్రధాని మోదీకి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం హామీలు అమలు చేయాలని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి నిధులు కేటాయించాలని, పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా పూర్తి చేయాలని, వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం ఆపాలని కోరుతూ ప్రధాని మోదీని బహిరంగ లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్నబాబు, బ్రహ్మజీ, శ్రీనివాసు, చింటూ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామానుజాచార్యులు జయంతి



పూజ చేస్తున్న అర్చకుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రామానుజాచార్యులు జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలోని పారేపల్లి రామానుజ కూటం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో రామానుజాచార్యుల జయంతి నిర్వహించారు. తొలుత రామానుజాచార్యుల విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకారం చేశారు. అదే విధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భజన బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక సంకీర్తన నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు. రామానుజకూటం వ్యవస్థాపక చైర్మన్ చేబ్రోలు విజయలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శివాజీ విగ్రహ నిర్మాణ పనులు ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: స్థానిక విజయవాడ రోడ్డులోని తొర్రగుంటపాలెం- దుర్గాపురం కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు చిట్టా లక్ష్మీనరసింహాశాస్త్రి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహాశాస్త్రి మాట్లాడుతూ పట్టణంలోకి విచ్చేసే వారికి మొట్టమొదటగా హిందూ ధర్మ పరిరక్షకుడు చత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం కనిపించేలా ఏర్పాటు చేస్తున్న కోర్ కమిటీ, విగ్రహం ఏర్పాటు కమిటీ సభ్యులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటుకు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, విగ్రహ కోర్ కమిటీ ప్రతినిధులు పబ్బంతి నరేంద్ర, సంకా భాస్కర్, నోముల రఘు, అల్లి రవిచంద్, ఉత్సవ కమిటీ సభ్యులు పి.సత్యనారాయణ, రామ్మోహనరావు, సురేష్ పాల్గొన్నారు.